సాక్షి కరీంనగర్

సోమవారం । 19 । జూన్ । 2023



బుక్‌లెట్ అందజేత

కరీంనగర్‌టౌన్: మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా నరేంద్ర మోదీ 9ఏళ్ల పాలనపై రూపొందించిన బుక్‌లెట్‌ను నగరంలోని తుమ్మల రాంరెడ్డికి ఎంపీ బండి సంజయ్‌కుమార్ అందించారు.



ఆధార్ నవీకరణ మనచేతుల్లోనే..

ఆధార్‌కార్డు నవీకరణకు సర్కారు గడువు పెంచింది. ఈ క్రమంలో మనమే సొంతంలో అప్‌డేట్ చేసుకునే అవకాశం కల్పించింది.

IIలో▸

గరిష్టం/కనిష్టం
40.0/28.0

వాతావరణం

జిల్లాలో ఎండతీవ్రత కొనసాగుతుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత కొనసాగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ప్రయివేటు ఆస్పత్రుల దోపిడీ అరికట్టాలి



మాట్లాడుతున్న వాసుదేవారెడ్డి

కరీంనగర్: జిల్లాకేంద్రంతో పాటు వివిధ మండలకేంద్రాల్లో ప్రైవేట్ హాస్పిటల్ యజమాన్యాలు, డాక్టర్లు రోగుల నుంచి ఇష్టారీతిన డబ్బులు గుంజుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి ఆరోపించారు. ఆదివారం ముకుందలాల్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు ఆసుపత్రుల్లో డాక్టర్లే మెడికల్ షాపులు, ల్యాబ్‌లు నిర్వహిస్తూ, అవసరం లేకున్నా టెస్టులు చేస్తూ డబ్బులు గుంజుతున్నారని అన్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులతో కుమ్మక్కై కమీషన్లు తీసుకుంటున్నారని అన్నారు. అవసరం లేకున్నా ఆపరేషన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టులు లేకుండా నడుపుతున్నప్పటికీ డ్రగ్‌ఇన్స్‌పెక్టర్లు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. అనుమతి లేని ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు యూ.శ్రీనివాస్, సుంకరి సంపత్, డి.నరేశ్, పూజ, శ్రీకాంత్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్



క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2023లో భాగంగా ఆదివారం వివిధక్రీడాంశాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించామని కన్వీనర్ ఆచార్య రాజేశ్‌కుమార్ తెలిపారు. బీ.పీ.ఈడీ, డీ.పీ.ఈడీ కోర్సులో ప్రవేశానికి జరిగిన పరీక్షకు 385 మంది పురుష, 105 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఆదివారం నాటి పరీక్ష పోటీలను పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన వారిని అభినందించారు. టీఎస్‌పీఈసెట్ మాజీ కన్వీనర్ ఆచార్య పి.వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.వరప్రసాద్, జె.ప్రభాకర్ రావు, వి.రమేశ్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ నజీముద్దీన్ మునావర్, తదితరులు హాజరయ్యారు.

టీఎస్ ఎంఐడీసీ జిల్లా కమిటీ ఎన్నిక



సమావేశానికి హాజరైన సభ్యులు

కరీంనగర్‌టౌన్: తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ (టీఎస్ఎంఐడీసీ) కరీంనగర్ జిల్లా కమిటీని ఆదివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ రాజగోపాల్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ప్రణవ్ కుమార్, కోశాధికారిగా డాక్టర్ తులసీదాస్ ఎన్నికయ్యారు. నూతన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజగోపాల్ మాట్లాడుతూ... ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు కత్తి జనార్దన్, పూర్ణచందర్, రాంబాబు, కిరణ్, రమేష్, శ్రీకర్, నాగశేఖర్, రమాదేవి, ఇందు, గ్రీష్మణ్యా, వెంకటేష్, ధర్మ నాయక్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు ఎంపిక



కే. రామకృష్ణ

కరీంనగర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న జరిగే విద్యా దినోత్సవం సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, అధ్యాపకులకు రాష్ట్ర కళాశాల విద్యాశాఖ పురస్కారాలు ప్రదానం చేయనుంది. జిల్లా నుంచి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా కలువకుంట రామకృష్ణ(ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల, కరీంనగర్), ఉత్తమ అధ్యాపకులుగా డాక్టర్ పి.దినకర్ (ప్రభుత్వ కళాశాల, హుజూరాబాద్),డాక్టర్ టి.లావణ్య (ప్రభుత్వ మహిళా కళాశాల, కరీంనగర్), డాక్టర్ రాజశేఖర్ (ప్రభుత్వ కళాశాల జమ్మికుంట), డాక్టర్ ఎస్.ఓదెలుకుమార్, డాక్టర్ టి.ప్రమోద్‌కుమార్ (ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల, కరీంనగర్)లు ఎంపికయ్యారు.

టార్గెట్.. గ్రీన్‌సిటీ

కరీంనగర్ కార్పొరేషన్: రోజురోజుకు పెరుగుతున్న కాంక్రీట్ జంగల్‌ను గ్రీన్‌సిటీగా మార్చేందుకు నగరపాలకసంస్థ కసరత్తు ముమ్మరం చేస్తోంది. మూడేళ్లలో నగరంలో దాదాపు 60ఎకరాల్లో చిట్టడవులు పెంచగా, ఏటా ఆరు నుంచి ఏడు లక్షల మొక్కలు నాటుతున్నారు. ఈసారి కూడా 6,13,709 మొక్కలు నర్సరీల్లో సిద్ధంగా ఉంచారు. హరిత హారంలో సాధించిన ప్రగతి మేరకు నగరపాలకసంస్థ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది. సోమవారం హైదరాబాద్‌లో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ సేవా ఇస్లావత్ అవార్డు అందుకోనున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా కథనం.



నగరంలోని బృహత్ ప్రకృతివనం

- ఆరు లక్షల మొక్కలు సిద్ధం
- ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు
- 60 ఎకరాల్లో చిట్టడవులు
- హరితహారంలో బల్దియాకు అవార్డు

పచ్చదనం పెంచడమే లక్ష్యంగా..

నగర విస్తరణ.. భవన నిర్మాణాలు.. నిరంతర అభివృద్ధి పనుల ఫలితంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. పచ్చదనం పెంచి, కాలుష్యరహిత నగరంగా మార్చేందుకు చిట్టడవులు, పట్టణ ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, రోడ్లు, ఇండ్లల్లో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

- ఏటా దాదాపు ఆరు నుంచి ఏడు లక్షల మొక్కలను నాటుతున్నారు. నగరంలో 82 వేల గృహాలు ఉండగా, దాదాపు 50 వేల ఇండ్లల్లో మొక్కలు పెంచే పరిస్థితి ఉంది.
- అలాంటి అవకాశం ఉన్న ఇండ్లకు మూడు పండ్ల మొక్కలు, మూడు పూల మొక్కలను ప్రతి సంవత్సరం అందచేస్తున్నారు. స్మార్ట్‌సిటీగా ఎంపిక కావడం, నగరంలో అభివృద్ధి పనులు నిరంతరంగా సాగుతుండడంతో చెట్లు మాయమవుతున్నాయి.
- దీంతో కొన్ని కాలనీలు పచ్చదనానికి దూరమవుతున్నాయి. దీనిని నివారించేందుకు మొక్కలను విరివిగా పెంచాలని నగరపాలక సంస్థ నిర్ణయించింది. కాగా నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మరింతగా చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉంది.
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగరపాలకసంస్థ మరో అవార్డును సొంతం చేసుకుంది. హరితహారంలో మొక్కలు పెంచడం, సంరక్షించడంతో రాష్ట్రస్థాయిలో అవార్డు దక్కింది. హరితోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, కమిషనర్ సేవా ఇస్లావత్ ఈ అవార్డు అందుకోనున్నారు.

సిటీ పరిధిలో ప్రకృతి వనాలు

ప్రాంతం	ఎకరాలు	నాటిన మొక్కలు
సదాశివపల్లి	4	7,000
ఎస్ఆర్ఆర్ కళాశాల	5	2,517
ఆర్‌టీసీ వర్క్‌షాప్	3	2,453
బ్లాక్ 6	6	7,000
సీఎం పాయింట్	10	7,200
ఎస్ఆర్ఎస్‌పీ,పద్మనగర్	1	3,000
మార్క్‌ఫెడ్	4	2,159
బుల్‌సిమెన్ సెంటర్	15	47,000
శాతవాహన యూనివర్సిటీ	3	5,000
పీజీ ఫార్మసీ కాలేజ్	2	5,000
స్పోర్ట్స్ స్కూల్	10	4,470
బృహత్ పట్టణ ప్రకృతి వనాలు		
బుల్‌సిమెన్ సెంటర్	5	23,000
శాతవాహన యూనివర్సిటీ	2	2,000
పీజీ ఫార్మసీ కాలేజ్	10	25,290
మధ్యస్థ ప్లానిటేషన్ :		
సిరిసిల్ల బైపాస్	7 కిలోమీటర్లు	15,000
అల్గునూరు టు హైదరాబాద్‌రోడ్	3 కిలోమీటర్లు	4,000
సిటీ ఇంటర్నల్	14.5 కిలోమీటర్లు	15,095
అనుబంధ ప్లానిటేషన్ :		
రామగుండం బైపాస్ రోడ్డు	5 కిలోమీటర్లు	5,000
సిరిసిల్ల బైపాస్ రోడ్డు	4 కిలోమీటర్లు	7,000
తీగలగుట్టపల్లి	2 కిలోమీటర్లు	4,490
కేంద్రీయ విద్యాలయం	2 కిలోమీటర్లు	3,525
హైదరాబాద్ రోడ్	1 కిలోమీటరు	1,090
అంతర్గతంగా	=	1445
వైకుంఠధామాలు	4 ఎకరాల్లో	8,595
స్ఫూర్తివనం, కార్ఖానగడ్డ	ఎకరం	3,820
ఇతరత్రా	=	62,300
ఇంటి స్థలాల్లో	=	10,31,841

నర్సరీల వివరాలు

ఎల్ఎండీ (ఓల్డ్), ఎల్ఎండీ (న్యూ), స్పోర్ట్స్ స్కూల్, కోతిరాంపూర్, మార్కెట్ ట్యాంక్, కిసాన్ నగర్, కోర్టు ట్యాంక్, ఎస్ఆర్ఆర్ కళాశాల, ఎస్ఆర్ఆర్ ట్యాంక్, రాంనగర్ ట్యాంక్, బుల్‌సిమెన్ సెంటర్, బుల్‌సెమెన్ సెంటర్ (న్యూ), విద్యానగర్ డివిజన్ 32, కట్టరాంపూర్ డివిజన్ 11, సదాశివపల్లి డివిజన్ 7,హుస్సేనిపుర డివిజన్ 27, రాంనగర్ డివిజన్ 37, వల్లంపహాడ్ డివిజన్ 1 తో పాటు చింతకుంటలో అటవీశాఖ నిర్వహించే నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు.

60 ఎకరాల్లో చిట్టడవులు



నగరంలో పచ్చదనం పెంచడం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నాం. మా హయాంలో ఇప్పటికే 60 ఎకరాల్లో చిట్టడువులు పెంచాం. ప్రతి సంవత్సరం ఆరు లక్షలకు తక్కువ కాకుండా మొక్కలు నాటి, సంరక్షిస్తున్నాం. రాశి వనాలతో ప్రజలను హరితహారం వైపు మళ్లించే కృషి చేస్తున్నాం. ఈ సారి రాశుల ఆధారంగా ఇండ్లకు కూడా మొక్కలు అందిస్తాం. పచ్చదనం పెంచి కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు పాటుపడుతున్నాం. – మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్ ముస్తాబు

- రూ.2 కోట్లతో సుందరీకరణ పనులు
- 21న మంత్రి కేటీఆర్ రాక



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో నగరపాలకసంస్థ ముస్తాబవుతోంది. ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కేబుల్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి కేటీఆర్ ఈ నెల 21వ తేదీన కరీంనగర్‌కు వస్తుండడం తెలిసిందే. కేబుల్ బ్రిడ్జితో పాటు నగరంలో నూతనంగా నిర్మించిన తెలంగాణ చౌక్, హౌసింగ్‌బోర్డుకాలనీ చౌరస్తా జంక్షన్లను ప్రారంభించనున్నారు. మోడ్రన్ లైబ్రరీ, కాశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. దీంతో అధికారులు హడావుడిగా ఆధునీకరణ, సుందరీకరణ పనులు చేపట్టారు. పర్యటన ఖరారు కాగానే సుమారు రూ.2 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు సమాచారం. నగరపాలక కార్యాలయ మూడో అంతస్తులో నిర్మిస్తున్న నూతన సమావేశ మందిరం, రెండవ అంతస్తులోని పాత సమావేశ మందిర ఆధునీకరణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. కార్యాలయంలో మొదటిసారిగా లిఫ్ట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సిటిజన్ సర్వీస్ సెంటర్, రెవెన్యూ, బర్త్ అండ్ డెత్, మెప్మా విభాగాల గదులను ఆధునీకరిస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంట్రల్ కార్యాలయ నిర్మాణ పనులు కూడా చివరిదశకు చేరుకున్నాయి. మేయర్ యాదగిరి సునీల్‌రావు ఎప్పటికప్పుడు పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ, అధికారులు, కాంట్రాక్టర్లకు సూచనలు చేస్తున్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంతో పాటు కేటీఆర్ వచ్చే కేబుల్ బ్రిడ్జి రోడ్డుపై కొత్తగా బీటీ వేశారు. మార్గమధ్యలో ఉన్న జంక్షన్లను తీర్చిదిద్దుతున్నారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు

కరీంనగర్‌సిటీ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఓపెన్ డిగ్రీలో ప్రవేశాల గడువు జూలై 31వరకు ఉందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి, కో– ఆర్డినేటర్ ప్రశాంతి తెలిపారు. అధ్యయనకేంద్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చని, వివరాలకు 73829 29755కు సంప్రదించాలని సూచించారు.

గొప్ప పథకం ‘మిషన్ భగీరథ’



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- ఇంటింటికీ మంచినీరు..కాళేశ్వరం జలాలతో నిండుకుండల్లా చెరువులు
- రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్

కొత్తపల్లి(కరీంనగర్): దేశంలోనే గొప్ప పథకం మిషన్ భగీరథ అని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మిషన్ భగీరథశాఖ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం ఎలగందల్ ఫిల్టర్ బెడ్ వద్ద ఆదివారం నిర్వహించిన మంచినీళ్ల పండుగకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో సస్యశ్యామలంగా ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతిపల్లెకు, గ్రామాలకు నాణ్యమైన తాగునీరు అందుతోందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో చెరువులన్నీ నిండి మండుటెండల్లో సైతం మత్తడి దూకుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పథకం ద్వారా 18,560 నీటి ట్యాంకులు, 67 వేల కి.మీ అంతర్గత పైపులైన్లు, 57 లక్షల నల్లా కనెక్షన్లను ఏర్పాటు చేసుకొని ఇంటింటికి నీరందించుకుంటున్నామని చెప్పారు. 2022 నుంచి నిత్యం నీటి సరఫరా చేసే మొదటి రాష్ట్రంగా తెలంగాణ అవార్డును గెలుచుకోవడం గర్వకారణమని చెప్పారు. జిల్లా పరిషత్ చైర్మన్ కనుమల్ల విజయ, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కొత్తపల్లి మున్సిపల్ చైర్పర్సన్ రుద్రరాజు, ఎంపీపీలు పిల్లి శ్రీలత, లక్ష్మయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ గర్వపడేలా కేబుల్ బ్రిడ్జి

కరీంనగర్: కేబుల్‌బ్రిడ్జిను తెలంగాణ గర్వపడేలా రూపొందించినట్లు మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని వి– కన్వెన్షన్‌లో కేబుల్ బ్రిడ్జి ప్రారంభ వేడుకలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. కేబుల్‌బ్రిడ్జిని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా 21కేబుల్‌బ్రిడ్జి ప్రారంభించడం జరుగుతుందని వివరించారు. దేశంలోనే తొలిసారిగా కేబుల్ బ్రిడ్జిపై పెద్ద స్క్రీన్ ఏర్పాటుచేయడం జరిగిందని అన్నారు. 22న కేబుల్‌బ్రిడ్జి వద్ద సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కలెక్టర్ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, మేయర్ వై.సునీల్‌రావు, అదనపు కలెక్టర్లు జీవీ.శ్యాంప్రసాద్‌లాల్, గరిమాఅగర్వాల్, ఆర్డీవో ఆనంద్ కమార్, ఏసీపీ తులశ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణిమధు, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

హృదయానికి హత్తుకునేలా రచనలు

కరీంనగర్‌కల్చరల్: హృదయానికి హత్తుకునేలా రచనలు ఉండాలని ప్రముఖ నవల రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి అన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ప్రముఖకవి మేఘనాథ్‌రెడ్డి రచించిన కలుంకూరి గుట్టపుస్తకానికి రాష్ట్రస్థాయి రజనీశ్రీ కథా పురస్కారం ప్రదానం చేశారు.రజనీశ్రీ కథా పురస్కార కమిటీ కన్వీనర్, అడిషనల్ కలెక్టర్ జీవీ.శ్యాం ప్రసాద్ లాల్ మాట్లాడుతూ తమ తండ్రి రజనీశ్రీ గొప్ప కళాకారులని, ఆయన కళాసాహిత్య రంగాలకు చేసిన సేవ శాశ్వతంగా నిలిచిపోయే విధంగా ఏటా పురస్కారం అందిస్తున్నామని తెలిపారు. మేఘనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తన జీవితంలోని అనుభవాలతాలూకు గుండెబరువుని అక్షరాలుగా మలిచానని సంతోషం వ్యక్తంచేశారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు నంది శ్రీనివాస్, గండ్ర లక్ష్మణరావు, పొన్నం రవిచంద్ర, అన్నవరం దేవేందర్, బెజ్జారపు వినోద్ కుమార్, స్తంభంకాడి గంగాధర్, గంగుల శ్రీకర్, ముత్తినేని శ్రీనివాస్, చలిగంటి సంజీవయ్య, సేనాధిపతి పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న మేఘనాథ్‌రెడ్డి

సర్వర్ పనిచేస్తలేదు

- రెవెన్యూ సర్టిఫికెట్లు ఇస్తలేరు
- తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కులవృత్తిదారుల ప్రదక్షిణలు
- జిల్లాలో 35వేల దరఖాస్తులు పెండింగ్



కరీంనగర్‌అర్బన్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు

కరీంనగర్‌రూరల్: బీసీ కులవృత్తిదారులు రూ.లక్ష రుణం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కులం, ఆదాయం సర్టిఫికెట్లు పొందడానికి పాట్లు పడుతున్నారు. మీసేవ సర్వర్ మొరాయిస్తుండటంతో వేలసంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. జిల్లాలోని 16 మండలాల్లో ఇప్పటివరకు 35,321 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆదాయం సర్టిఫికెట్ల కోసం మొత్తం 47,209 దరఖాస్తులు రాగా 25,430 జారీ చేశారు. 19,886 పెండింగ్‌లో ఉన్నాయి. కులం సర్టిఫికెట్ల కోసం 28,794 దరఖాస్తులు రాగా 13,148 సర్టిఫికెట్లు జారీ చేశారు. 15,435 పెండింగ్‌లో ఉన్నాయి.

తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు

మండలం	కులం	ఆదాయం
రామడుగు	640	753
చొప్పదండి	1,048	1,322
కరీంనగర్‌అర్బన్	2,613	3,720
కొత్తపల్లి	945	1,203
సైదాపూర్	360	408
వీణవంక	1101	1325
గన్నేరువరం	247	283
చిగురుమామిడి	634	736
ఇల్లందకుంట	688	259
శంకరపట్నం	495	276
గంగాధర	795	956
కరీంనగర్‌రూరల్	940	1,202
హుజూరాబాద్	2,097	2,520
జమ్మికుంట	1,031	2,281
మానకొండూరు	1,043	1,488
తిమ్మాపూర్	758	1,154
మొత్తం	15,435	19,886

మీసేవా సర్వర్ పనిచేస్తలేదు

బీసీల్లోని కులవృత్తిదారులకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ నెల 6 నుంచి అర్హులైన వృత్తిదారుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తోంది. రుణ మంజూరుకు అవసరమైన కులం, ఆదాయం సర్టిఫికెట్లను పొందడం తలకు మించిన భారంగా మారింది. మీ సేవాకేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుని రోజులు గడుస్తున్నప్పటికి సర్టిఫికెట్లు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజుల నుంచి సర్వర్ పనిచేయకపోవడంతో తహసీల్దార్ కార్యాలయాల్లో సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయింది. విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవడంతో సర్టిఫికెట్ల జారీ అధికారులకు కత్తి మీద సాముల మారింది. దరఖాస్తులపై సంతకాలు చేసి సర్టిఫికెట్లను జారీ చేయాల్సిన తహసీల్దార్లు, ఆర్ఐలు ఓటరు సర్వే కార్యక్రమంలో పాల్గొనడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి వేలసంఖ్యలో దరఖాస్తులు రావడంతో సర్వర్ సమస్య తలెత్తుందని తహసీల్దార్లు పేర్కొంటున్నారు. కొన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సర్వర్ సమస్య ఉందని, సర్టిఫికెట్ల జారీ ఆలస్యమవుతుందని ఏకంగా నోటీస్‌బోర్డు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వారమైతంది..



కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసి వారం రోజులవుతోంది. ఆఫీసులో అడిగితే ఆ టేబుల్ మీద ఉంది, ఈ టేబుల్ మీద ఉన్నాయంటున్నారు. ప్రతిరోజు ఆఫీసుకు వచ్చి పోతున్నా. ఇప్పటివరకు సర్టిఫికెట్లు ఇవ్వలేదు. – పోచంపల్లి నిర్మల, కరీంనగర్

మీసేవా నుంచి రాలేదంటున్నారు



పదిరోజుల క్రితం మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నా. రెండు, మూడు రోజుల్లో సర్టిఫికెట్లు వస్తాయంటే ఓపికపట్టాను. సర్టిఫికెట్లు రాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే మీసేవా కేంద్రం నుంచి దరఖాస్తు రాలేదంటున్నారు. సర్టిఫికెట్ల కోసం అడిగితే ఎవరు పట్టించుకుంటల్లేరు.
– దీకొండ శంకర్, మంకమ్మతోట

ఇంటింటా సర్వే ఆకస్మిక తనిఖీ

కరీంనగర్ అర్బన్/కొత్తపల్లి: ఇంటింటా ఓటరు సర్వేను కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం పారదర్శక ఓటరు జాబితాకు ఆదేశించగా కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించారు. రెండురోజులకోసారి సమీక్షలు నిర్వహిస్తుండగా ఓటరు తొలగింపు, చేర్పులతో పాటు పోలింగ్ కేంద్రాల ఏర్పాటును పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం నగరంలోని పోచమ్మవాడతో పాటు పలు కాలనీల్లో ఇంటింటా సర్వే తీరును పరిశీలించారు. కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలో ఓటరు సర్వేను తనిఖీ చేశారు. బీఎల్‌వోలతో మాట్లాడి ఓటరు జాబితాను పరిశీలించారు. జాబితాలోని వివరాలతో ఇంటి నంబరు, కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు మరోచోటకు మారినా మరణించిన వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్‌ఓలకు సూచించారు. అదే విధంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎలగందుల ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. నీటిశుద్ధి ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో ఆనంద్‌కుమార్, అర్బన్ తహసీల్దార్ జగత్‌సింగ్, కొత్తపల్లి తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



పోచమ్మవాడలో పర్యటిస్తున్న కలెక్టర్ కర్ణన్

క్లుప్తంగా

షార్ట్‌ సర్క్యూట్‌తో నగదు, సామగ్రి దగ్ధం

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌ గ్రామానికి చెందిన బోగ రాజమౌళి ఇంట్లో ఆదివారం షార్ట్‌ సర్క్యూట్‌తో నగదు, సామగ్రి దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. ఉదయం విద్యుత్‌ సర్క్యూట్‌ జరిగి మంటలు అంటుకున్నాయి. ఇంట్లోని బీరువా తో పాటు, దాచుకున్న చిట్టీ డబ్బులు రూ.3 లక్షలు, రూ.2 లక్షల విలువైన వస్తువులు పూ ర్తిగా కాలిపోయాయి. బాధిత కుటుంబాన్ని ప్ర భుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ప్రజాకవి ‘మిట్టపల్లి’కి సన్మానం

జమ్మికుంట(హుజూరాబాద్‌): ప్రజా కవి, నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్‌ను జాతీయ కళారత్న అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్‌ ఆదివారం సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, మారుమూల గ్రామంలో పుట్టి ప్రతిభతో అంచలంచెలుగా సినీ గేయ రచయితగా ఎదిగారన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన ఏన్నో పాటలు ఆయన కలం నుంచి జాలువారాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రహీం

శంకరపట్నం(మానకొండూర్‌): మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రహీం అనే వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామస్తుల వివరాలు.. హుజురాబాద్‌ మండలం కందుగుల గ్రామానికి చెందిన రహీం, సంపత్‌ మోటార్‌సైకిల్‌పై కరీంనగర్‌ నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. మండలంలోని కొత్తగట్టు సమీపంలోకి రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రహీంకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎమ్‌టీ సురేశ్‌ ప్రథమ చికిత్స చేసి హుజురాబాద్‌ ఆస్పత్రికి తరలించారు.

వడదెబ్బతో అనాథ మహిళ మృతి


కనకవ్వ (ఫైల్‌)

మానకొండూర్‌: మండలంలోని లింగాపూర్‌ గ్రామానికి చెందిన గంధం కనకవ్వ (65) వడదెబ్బతో మృతిచెందగా ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కనకవ్వ ఇదే మండలంలోని లక్ష్మీపూర్‌ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని వివాహం చేసుకోగా అతడు గతంలోనే మృతిచెందాడు. బతికేందుకు ఆమెకు జీవనాధారం లేకపోవడంతో కరీంనగర్లోని ఆలయాల వద్ద భిక్షాటన చేస్తూ గడిపేది. కాగా శనివారం ఓ ఆలయం వద్ద భిక్షాటన చేస్తూ వడ దెబ్బతో మృతిచెందగా మృతదేహాన్ని స్థానిక పోలీసులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం మృతురాలి వివరాలు తెలుసుకున్న పోలీసులు లింగాపూర్‌ గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామానికి చెందిన మోట సమ్మయ్య, కులస్తులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆధార్‌ అప్‌డేట్‌ మన చేతుల్లోనే..

- గడువు పెంచిన ప్రభుత్వం
- సెప్టెంబర్‌ 14 వరకు అవకాశం



కరీంనగర్‌ అర్బన్‌: ఆధార్‌ కార్డు అప్‌డేట్‌కు గడువు పొడిగించారు. పదేళ్ల పూర్తయిన ఆధార్‌ కార్డులను అప్‌డేట్‌ చేసుకోవాలని యుఐడీఏఐ నిర్దేశించిన విషయం తెలిసిందే. ఈ నెల 14తో గడువు ముగియగా మరో మూడు నెలలు పెంచారు. కాగా బ్యాంకు ఖాతా నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షల వరకూ ప్రతి దానికీ ఆధార్‌ కార్డు తప్పనిసరిగా మారింది. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ కార్డును పదేళ్లకోసారి తప్పనిసరిగా అప్డేట్‌ చేయించుకోవాలని విశిష్ట గుర్తింపు పొందిన ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) నిర్దేశించిన విషయం తెలిసిందే. కేంద్రం మూడు నెలలపాటు ఎలాంటి రుసుము చెల్లించకుండా దరఖాస్తుదారుడు ఆన్‌లైన్‌లో ఉచితంగా నవీకరణ చేసుకునే వెసులుబాటు కల్పించగా మరో 3 నెలలు పొడిగించింది. ఈ నేపథ్యంలో సొంతంగా అప్‌డేట్‌ చేసుకునే విధానంపై కథనం.

రెండు పద్ధతుల్లో నవీకరణ

రెండు పద్ధతుల్లో ఆధార్‌ అప్‌డేట్‌కు కేంద్రం అవకాశం కల్పించింది. కంప్యూటర్‌ పరిజ్ఞానమున్న వారు ‘మై–ఆధార్‌ పోర్టల్‌’, ‘ఎం–ఆధార్‌’ యాప్‌ ద్వారా ఉచితంగా చేసుకోవచ్చు. రెండో పద్ధతిలో మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగుతున్న శాశ్వత ఆధార్‌ కేంద్రాల సాయంతో చేసుకోవచ్చు. శాశ్వత ఆధార్‌ కేంద్రాల ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.

స్వయంగా చేసుకోవాలనుకుంటే ఇలా..

ముందుగా మైఆధార్‌.యూఐడీఏఐ.జీవోవీ.ఇన్‌ పోర్టల్‌ తెరవాలి. ఫోన్‌ నంబరు నమోదు చేసి వచ్చే ఓటీపీతో లాగిన్‌ కావాలి. మార్పులు చేసుకోవాలనుకునే వారు డాక్యుమెంట్‌ అప్డేట్‌ ఆప్షన్‌పై క్లిక్‌ చేయాలి. పేరు, ఇతర వివరాలను రుజువు చేస్తూ తగిన ధ్రువపత్రాలు అప్‌లోడ్‌ చేయాలి. అనంతరం చిరునామా రుజువు చూపుతూ ఉన్న మరో ధ్రువీకరణ పత్రాన్ని అప్లోడ్‌ చేసి సబ్మిట్‌ చేయాలి. ఇవన్నీ పూర్తయ్యాక నవీకరణ పూర్తయినట్లు రశీదు డౌన్లోడ్‌ అవుతుంది. ఫోన్‌ నంబర్‌కు సంబంధిత మెసేజ్‌ వస్తుంది.

వీరికి తప్పనిసరి..

2010 నుంచి 2018 వరకు ఆధార్‌ నమోదుదారునికి కార్డుపై పేరుతోపాటు తండ్రి, భర్త, అనే విధంగా బంధుత్వం ఉంటుంది. 2018 తర్వాత వాటిని తొలగించి కేవలం కేరాఫ్‌గా కొనసాగిస్తున్నారు. కేరాఫ్‌ లేకుంటే తప్పనిసరిగా నవీకరించుకోవాలి. 2009లో ఆధార్‌ ప్రారంభమైన సమయంలో వ్యక్తిగత వివరాలు నమోదు చేశారే తప్ప ధ్రువీకరణ పత్రాలు అప్లోడ్‌ చేయలేదు. ప్రస్తుతం పదేళ్లకోసారి తగు ధ్రువపత్రాలు పొందుపరిచేలా నిబంధనలు చేర్చటంతో కార్డుదారుల వివరాలు కచ్చితత్వంతో ఉంటాయి.

జెండర్‌ మార్పు ఒక్కసారి మాత్రమే

జెండర్‌ (లింగం) విషయంలో తప్పులు సవరించుకోవాలంటే ఒకసారి మాత్రమే అవకాశం కల్పించారు. ఇందుకు తప్పనిసరిగా అర్హతగల గుర్తింపు పత్రాన్ని జత చేయాలి. మరోసారి తప్పును సవరించాలంటే ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లాల్సిందే. దరఖాస్తుదారులు ఈ విషయాన్ని విస్మరించొద్దు. ప్రతి పదేళ్లకోసారి ఆధార్‌లో చిరునామా, స్థానికతను నిర్ధారించుకుంటూ నవీకరణ చేసుకోవాలి. ఇందుకు చిరునామా ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలి.

దరఖాస్తు మూడు కేటగిరీలు

గతంలో కార్డులో మార్పులకు రెండు రకాల దరఖాస్తులుండగా ప్రస్తుతం వయసు ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించారు. ఐదేళ్లలోపు పిల్లలు మొదటి.. 5–18 ఏళ్ల వారికి రెండో, 18 ఏళ్లు పైబడిన వారిని మూడో కేటగిరీగా చేశారు. ఆన్‌లైన్‌లో అయినా శాశ్వత కేంద్రాల్లో అయినా వీటిని పూరించాల్సి ఉంటుంది.

పుట్టిన తేదీ మార్పా.. ధ్రువీకరణ పత్రమే

గతంలో పుట్టిన తేదీ మార్పునకు యూఐడీఏఐ నమూనా ఫారం పూరించి గెజిటెడ్‌ అధికారి సంతకం తీసుకుంటే సరిపోయేది. పాన్‌కార్డులోని పుట్టిన తేదీని అధికారికంగా ధ్రువీకరించుకునే వీలుండేది. ప్రస్తుతం చిన్నారులకు తప్పనిసరిగా గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘం జారీచేసిన పుట్టిన తేదీ ధ్రువపత్రాన్ని సమర్పించాల్సిందే. కార్డులో ఒక్కసారి మాత్రమే పుట్టిన తేదీని మార్చుకోవచ్చు. రెండోసారి మార్చాలనుకుంటే రాష్ట్ర రాజధానిలోని కార్యాలయానికి వెళ్లి అందుకు తగిన వివరణ ఇస్తూ ధ్రువపత్రాలు సమర్పించాలి.

రాజ్యాధికారంతోనే సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న లచ్చన్న

కరీంనగర్‌: రాజ్యాధికారంతోనే బీసీల సమస్యలు పరిష్కారం అవుతాయని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి లచ్చన్న అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కడారి ఐలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాజ్యాధికారం ఒకరు ఇస్తే వచ్చేది కాదని పోరాడి సాధించుకోవడమే మార్గమని స్పష్టం చేశారు. ఇది బీసీల ఐక్యతతోనే సాధ్యపడుతుందన్నారు. బీసీ బంధు ప్రకటించి ప్రతి బీసీకి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గడప కోటేశ్‌కుమార్‌, జిల్లా ఉపాధ్యక్షులు వంగ వెంకటేశ్వర్లు, కొండా రవీందర్‌, జంగా కొమురయ్యయాదవ్‌, జిల్లా కార్యదర్శి ఈరెల్ల విజయ్‌కుమార్‌, పెద్దిరాజు సత్యనారాయణరాజు, అనవేని శ్రీనివాస్‌, కనపర్తి రమేష్‌, ప్రవీణ్‌కుమార్‌, గాజుల వేణుకుమార్‌, పెద్దపెల్లి సురేష్‌, కట్ట రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామం పర్లపల్లి: ఎమ్మెల్యే రసమయి


సర్పంచ్‌ భారతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిమ్మాపూర్‌ మండలం పర్లపల్లి గ్రామ పంచాయతీ పచ్చదనం, పరిశుభ్రత, తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా అవార్డు సాధించింది. అలాగే అభివృద్ధిలో ఉన్నత ప్రమాణాలు పాటిస్తున్నందుకు పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐఎస్‌వో 9,001 సర్టిఫికెట్‌ పొందింది. ఈ సందర్భంగా సర్పంచ్‌ మాదాడి భారతిని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్‌, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ ఎల్‌ఎండీ కాలనీలోని క్యాంప్‌ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, తన నియోజకవర్గంలోని పర్లపల్లి గ్రామానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. సర్పంచ్‌తోపాటు పంచాయతీ పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యదర్శి మాదాడి రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ సంపత్‌రెడ్డి, ఉప సర్పంచ్‌ సుద్దాల రాజేష్‌, వార్డు సభ్యులు గుమ్మడి రాజు, శనివారపు యాదగిరి, కామల్ల సరవ్వ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి నల్లా నీరు

మిషన్‌ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లా నీరు చేరుతుందని మానకొండూరు, హుస్నాబాద్‌ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్‌, సతీష్‌బాబు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తిమ్మాపూర్‌ మండలం ఎల్‌ఎండీ కాలనీలోని మిషన్‌ భగీరథ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్‌ భగీరథ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం హార్‌ ఘల్‌ పథకం పేరుతో అమలు చేస్తుండడం రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, అడిషనల్‌ కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌ తదితరులు పాల్గొన్నారు.

త్రినిటీ విద్యార్థుల విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్‌: జేఈఈ(అడ్వాన్స్‌డ్‌) ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారు. ఎ.అభిరామ్‌ 415వ ర్యాంకు, ఎస్‌.సాచి 800, జి.దిలీప్‌ 908, కె.గోపాల్‌ 1,017, జి.గంగాధర్‌ 1,117, ఎం.రాజారెడ్డి 1,137, ఎస్‌.సుహాస్‌రెడ్డి 1,430, పి.అభినయ 1,674వ ర్యాంకు సాధించారు. ఈసందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్‌ దాసరి ప్రశాంత్‌రెడ్డి, వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్‌, అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం


పల్లె బిందు


పవన్‌ సూర్య


శ్రీవాత్సవ


సాయిప్రభాస్‌

కరీంనగర్‌: జేఈఈ మెయిన్స్‌ -2023 ఫలితాల్లో శ్రీ చైతన్య జూనియర్‌ కళాశాల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారు. ఎస్‌.పవన్‌ సూర్య 903వ ర్యాంకు, పల్లె బిందు 2,467, మారుపాక శ్రీవాత్సవ 3,159, కల్వల సాయిప్రభాస్‌ 4,295వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్‌ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, అంకితభావంతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. నాణ్యమైన కార్పొరేట్‌ స్థాయి విద్యను ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో శ్రీచైతన్య విద్యా సంస్థలు నడుస్తున్నాయని వివరించారు. శ్రీ చైతన్య గ్రూప్‌ ఆఫ్‌ జూనియర్‌ కళాశాల స్థాపించిన నాటి నుంచి రాష్ట్రస్థాయి ర్యాంకులకు కేరాఫ్‌ అడ్రస్‌గా నిలుస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, కళాశాలల డైరెక్టర్‌ నరేందర్‌రెడ్డి, డీన్‌ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్‌ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్‌, అధ్యాపకులు అభినందించారు.

రెండు కార్లు ఢీకొని ఒకరి దుర్మరణం

- ఇద్దరికి గాయాలు


శివశంకర్‌ (ఫైల్‌)

జగిత్యాల క్రైం: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన కట్ట శివశంకర్‌(46), అతని స్నేహితుడు చంద్రశేఖర్‌ వ్యాపారం నిమిత్తం ఆదివారం ఉదయం కారులో ఆర్మూర్‌ వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా బీమారం మండలంలోని పసునూరు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు ఈర్నాల తిరుపతి కారులో వెళ్తున్నాడు. జగిత్యాల అర్బన్‌ మండలంలోని హస్నాబాద్‌ శివారులో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శివశంకర్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. చంద్రశేఖర్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, తిరుపతి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. శివశంకర్‌ మృతితో మంచినీళ్ల బావి ప్రాంతంలో విషాదం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య లత, కుమారుడు ఉన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి


సంతోష్‌(ఫైల్‌)

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధి కూచిరాజ్‌పల్లిలో దాసరి సంతోష్‌(28) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్సపొందుతూ శనివారం అర్ధ రాత్రి తర్వాత మృతిచెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. సంతోష్‌ తన తమ్ముడికి వివాహం కాగా, తనకు మాత్రం కావడం లేదని బాధతో తాగుడుకు బానిసై ఏం పనిచేయడం లేదు. ఈ నెల 16న గ్రామ శివారులోని నందికట్ట ప్రాంతంలో మద్యం సేవించి తర్వాత గడ్డి మందు తాగాడు. విషయం తన మిత్రుడికి చెప్పడంతో అక్కడికి వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి..


అంజయ్య(ఫైల్‌)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీ సంతోష్‌నగర్‌కు చెందిన ఎరుకల అంజయ్యగౌడ్‌(61) నిమ్స్‌ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం వేకువజామున మృతిచెందాడు. గోదావరిఖని–2టౌన్‌ పోలీసుల వివరాలు.. ఈ నెల 16న రాత్రి 8గంటల సమయంలో అంజయ్య గోదావరిఖని నుంచి యైటింక్లయిన్‌కాలనీ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, యైటింక్లయిన్‌కాలనీ నుంచి గోదావరిఖని వస్తున్న పెండం కళ్యాణ్‌కుమార్‌ ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంజయ్యను హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు లక్ష్మణ్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళాధర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

రాయికల్‌(జగిత్యాల): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటికొండాపూర్‌ గ్రామానికి చెందిన రెబ్బాస్‌ విజయ్‌(27) కొన్నేళ్లు గల్ఫ్‌ వెళ్లి వచ్చాడు. నెల రోజుల క్రితమే అతనికి వివాహమైంది. ఈ క్ర మంలో మైతాపూర్‌కు చెందిన స్నేహితుడు గల్ఫ్‌ వెళ్తున్నాడని తెలిసి, అతనితో మాట్లాడేందుకు ఆదివారం ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. మైతాపూర్‌ శివారులోకి రాగానే స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో విజయ్‌ తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి బైఠాయింపు

వెల్గటూర్‌(ధర్మపురి): తనకు న్యాయం చేయాలంటూ ఓ యువతి తన ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన ఘటన వెల్గటూర్‌ మండలంలోని వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్‌ జిల్లా దస్తూరాబాద్‌ మండలం మున్యాలకు చెందిన ఓ యువతి తన అమ్మమ్మ గ్రామమైన వెంకటాపూర్‌లో ఉంటూ చదువుకుంది. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కానీ అతను గల్ఫ్‌ వెళ్లిపోయాడు. ఈ క్రమంలో ఆ యువతికి ఇటీవలే మరో వ్యక్తితో వివాహం జరిగింది. గల్ఫ్‌ వెళ్లిన యువకుడు కొన్ని రోజుల క్రితం స్వగ్రామం రాగా అతనితో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కానీ మనసు మార్చుకున్న ఆ యువకుడు ఆమెను జన్నారంలో వదిలి వెళ్లిపోయాడు. తనకు న్యాయం చేయాలంటూ బాధితురాలు ఆదివారం యువకుడి ఇంటి ఎదుట బైఠాయించింది. కానీ అంతకుముందే అతను ఇంటికి తాళం వేసి, కుటుంసభ్యులతో కలిసి ఎక్కడికో వెళ్లిపోయాడు.

దాడి ఘటనలో తల్లీకుమారుడిపై కేసు

జగిత్యాల క్రైం: జగిత్యాల పట్టణ శివారులోని లింగంపేటకు చెందిన సిరికొండ లక్ష్మణ్‌పై గొడ్డలితో దాడి చేసిన అతని తమ్ముడు రమేశ్‌, కళ్లలో కారం పొడి చల్లిన తల్లి భూదవ్వలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరికొండ లక్ష్మణ్‌, రమేశ్‌ల మధ్య రైల్వేస్టేషన్‌ సమీ పంలో ఉన్న వ్యవసాయ భూమి హద్దుల విషయంలో శనివారం గొడవ జరిగింది. తల్లిదండ్రులకు చెప్పేందుకు లక్ష్మణ్‌ వారు ఉంటున్న ఇంటికి వెళ్లగా రమేశ్‌ వెనక నుంచి వచ్చి గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. తల్లి భూదవ్వ కళ్లలో కారంపొడి చల్లడంతో అక్కడే స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు విషయాన్ని లక్ష్మణ్‌ భార్యకు చెప్పడంతో ఆమె బంధువుల సహాయంతో అతన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అతని తమ్ముడు, తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సింగరేణి రిటైర్డ్‌ ఉద్యోగి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ: జనగామ గ్రామానికి చెందిన రిటైర్డ్‌ సింగరేణి కార్మికుడు నీలం వెంకటరాజం (82) ఆదివారం తన ఇంట్లో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గోదావరిఖని రెండో పట్టణ పోలీసులు తెలిపారు. 20ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందిన వెంకటరాజం భార్యతో కలిసి జనగామలో నివాసముంటున్నాడు. ఈ ఏడాది జనవరిలో భార్య అనారోగ్యంతో చనిపోయింది. అప్పటినుంచి మానసికంగా కుంగిపోయాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటూ.. అప్పుడప్పుడు తన కుమార్తె దగ్గరకు వెళ్లి వస్తుండేవాడు. ఆదివారం ఇంట్లో విగతజీవిగా మారడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమార్తె, బంధువులు వచ్చి చూడగా అప్పటికే వెంకటరాజం మృతి చెంది ఉన్నాడు. ఆయన మృతదేహాన్ని సదాశయ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు అందిస్తున్నట్లు మృతుడి కుమార్తె, అల్లుడు తెలిపారు.

ఉరేసుకొని విద్యార్థి..

ధర్మారం(ధర్మపురి): మండలంలోని ఖిలావనపర్తి గ్రామానికి చెందిన విద్యార్థి కుందేళ్ళ చందు (19) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. చందు ఇంటర్‌ పూర్తి చేశాడు. తల్లిదండ్రుల వద్ద డబ్బులు లేక తాను పై చదువులు చదవలేననే బెంగతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌ తెలిపారు.

ఐఐటీ ఫలితాల్లో శ్రీచైతన్య ఐపీఎల్‌ ప్రతిభ

కరీంనగర్‌: జేఈఈ అడ్వాన్స్‌–2023 పరీక్షా ఫలితాల్లో కరీంనగర్లోని శ్రీ చైతన్య ఐపీఎల్‌ విద్యార్థులు సత్తాచాటారు. జిందం శ్రీనాథ్‌ ఆల్‌ ఇండియా 151వ ర్యాంక్‌, ఎం. రిషికేష్‌ ఆల్‌ఇండియా 158వ ర్యాంక్‌ సాధించారు. ఏ.శశిధర్‌ 902, టి.మణిశరవన్‌గౌడ్‌ 11,24, బి.అరిన్‌పటేల్‌ 1,726, ఎన్‌.సాయికృష్ణ 4,548, ఎం.హరిష్‌ 5,076, పి.కీర్తి 6,012, జె.శ్రీజ 8467 ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్‌ రాజ్‌కుమార్‌ తెలిపారు. ఈసందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్‌ మల్లంపాటి శ్రీధర్‌, డైరెక్టర్‌ శ్రీవిద్య, డీజీఎం లక్ష్మణరావు, ఆర్‌ఐ రాజు, కోఆర్డినేటర్‌ ప్రవీణ్‌కుమార్‌, ప్రిన్సిపాల్‌, ఐపీఎల్‌ ఇన్‌చార్జి శ్రీకాంత్‌రెడ్డి, సీ బ్యాచ్‌ ఇన్‌చార్జి మధుకర్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

అదుపుతప్పి ఒక లారీ బోల్తా


యెఖీన్‌పూర్‌లో బోల్తా పడిన లారీ

కోరుట్ల రూరల్‌: కోరుట్ల మున్సిపల్‌ విలీన గ్రామమైన యెఖీన్‌పూర్‌ శివారులో కోరుట్ల–వేములవాడ రోడ్డుపై ఆదివారం సాయంత్రం ఊక తరలిస్తున్న ఓ లారీ అదుపుతప్పి, బోల్తా పడింది. వేములవాడ వైపు నుంచి కోరుట్ల వైపు వస్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ ఓవర్‌ లోడ్‌తో ఉండటంతో కెనాల్‌ మలుపు వద్ద బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. కాగా ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

డివైడర్‌ను ఢీకొని కారు..


తంగళ్లపల్లిలో బోల్తాపడిన కారు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి గ్రామ శివారులో ప్రధాన రహదారిపై డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రం నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న స్విఫ్ట్‌ డిజైర్‌ కారు పద్మనగర్‌ గ్రామ శివారుకు చేరుకోగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. కారులో ఉన్న నలుగురికి స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఫోన్‌ చోరీ.. నగదు హరీ..

జమ్మికుంట(హుజూరాబాద్‌): ఫోన్‌ చోరీ చేసి.. నగదు కాజేసిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేశ్‌ తెలిపారు. మండలంలోని బిజిగిరిషరీఫ్‌ గ్రామానికి చెందిన ముద్దాసాని రాములు గత 14న శ్రీవారి దర్శనానికి తిరుపతి వెళ్లాడు. అక్కడ రాములు ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఫోన్‌ పే ద్వారా బ్యాంక్‌ అకౌంట్‌లోని రూ.23,500 కాజేశాడు. బాధితుడు స్వగ్రామం బిజిగిరిషరీఫ్‌కు చేరుకొని స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
సోమవారం ॥ 19-6-2023

మంచి మాట



సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వ మానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఇక ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు లుప్తం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వ కాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఐకమత్యం తరువాత విశ్వ మానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మానాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే 'సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అమలులో నిలపాలి.


ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికి ఇప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

గురువాణి

నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!



నీవు ఎదుగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

"ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హై ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః"

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్లు తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు.... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్లు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.

పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మబంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంతకన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

భాషా మాధుర్యం



ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.

ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు.

అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలు దేరుతున్న రచయితతో "ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?" అని అడిగాడు.

"నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను" అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధ పడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా

గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?


రవితేజ

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.


వారికి కాజల్ ఓ ఉదాహరణ

– దర్శకుడు శేఖర్ కమ్ముల

"మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్" అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– "తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లులాంటిది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా" అన్నారు. "నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు" అన్నారు అఖిల్ డేగల. "మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం" అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ

నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!


మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా

– నందితా శ్వేత


అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

"హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ–"హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు" అన్నారు. "ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది" అన్నారు అనూప్ రూబెన్స్.

మా నాన్న సూపర్ హీరో!


సుధీర్‌బాబు

'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. "తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

ఇదేం జీవితం?


రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాన్నీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. "మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది" అన్నారు ఎస్ఎస్ శాన్నీ.

రాకేష్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. చాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..

"ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు" అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

సంక్రాంతికి జాతర


ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–"జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం" అన్నారు. "ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం" అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.